క్లుప్తంగా

అంజన్నకు లక్ష తమలపాకుల పూజ



ఆకుపూజల్లో పాల్గొన్న మహిళలు

యద్దనపూడి: ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. యనమదల గ్రామంలో వేంచేసి ఉన్న తోపు వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో లక్ష తమలపాకుల పూజా కార్యక్రమాన్ని ధర్మకర్త శేషు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకుడు దీవి మురళీకృష్ణ ప్రసాద్ ఆగమ పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. కార్యక్రమం అనంతరం భక్తులకు విశేష ప్రసాద వితరణలు జరిగాయి.

31 మంది టీడీపీ నాయకులపై కేసు

మార్టూరు: జాతీయ రహదారిపై రాకపోకలకు అవరోధం కల్పిస్తారనే కారణంపై మార్టూరులో శనివారం 31 మంది టీడీపీ నాయకులపై ఎస్సై కే కమలాకర్ కేసు నమోదు చేశారు. సీఐ ఎస్కేటీ ఫిరోజ్ వివరాల మేరకు.. శనివారం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా జాతీయ రహదారిపై రాకపోకలకు అవరోధాలు కల్పిస్తారు అనే కారణంతోముందు జాగ్రత్తగా మార్టూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కషాయాలతో చీడపీడల నివారణ



బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తు ఐసీఆర్పీ

బల్లికురవ: ప్రకృతి వ్యవసాయంలో చేపట్టే పంటలకు బ్రహ్మాస్త్ర కషాయం పిచికారీతో చీడపీడలను నివారించుకోవచ్చని ఐసీఆర్పీ సుధారాణి, ఎల్టు వెంకటరావు తెలిపారు. శనివారం మండలంలోని పెదఅంబడిపూడి గ్రామంలో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. 5 రకాల చేదు, వగరు కలిగిన ఆకులు పదికేజిలు సేకరించి మెత్తగా దంచి పదిలీటర్ల ఆవు మూత్రంతో మరిగించాలన్నారు. చల్లారిన తర్వాత ఎకరా పైరుకు 100 లీటర్ల నీటికి ద్రావణాన్ని కలిపి చెట్టు కలిసే విధంగా పిచికారీ చేయాలన్నారు. పంటలపై ఆశించిన గొంగళి పురుగు, కాయతొలుచు పురుగు నివారణతో ఖర్చులేకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో చేపట్టే పంటలన్ని నాణ్యతతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని సుధారాణి వెంకటరావు వివరించారు.


నూతన రాతి మండప నిర్మాణానికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, కార్యనిర్వహణాధికారి

అద్దంకి రూరల్: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నూతన రాతి మండప నిర్మాణానికి శనివారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి సుభద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయంలో ఉదయం ఆలయ ప్రదక్షణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, అంరారోపణ, వాస్తు మండపారాధన, ప్రధాన కలశస్థాపన, వాస్తు హోమం, ప్రధాన దేవతామూర్తి అనుష్టానము సాయంత్రం శ్రీరామంజనేయం సుందరకాండ, మన్యుసూక్త పారాయణం, వారపు వాస్తు శుద్ధి, పంచగవ్యశుద్ధి, అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయణం, నిజ శ్రావణ మాసం, మృగశిర నక్షత్రం దశమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

శుద్ధ అబద్ధం

- పుట్టగొడుగుల్లా అనుమతిలేని వాటర్ ప్లాంట్లు
- అక్రమాలకు హెర్బల్ ముసుగు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం



వ్యాపార సంస్థలు, గృహాలకు విక్రయిస్తున్న వాటర్ క్యాన్లు

చీరాల: మారుతున్న కాలానికి అనుగుణంగా అక్రమార్కులు సైతం చెలరేగి పోతున్నారు. ప్రజల ఆరోగ్యంతో పనిలేకుండా స్వలాభం కోసమే అక్రబరితెగిస్తున్నారు. చిన్నగ్రామాల నుంచి పెద్ద పట్టణాల వరకు అందరూ తాగుతుంది మినరల్ వాటర్ పేరుతో నడుస్తున్న మామూలు నీరు. పేరులోనే మినరల్ తప్ప నీటిలో ఏమి ఉండవు. పేదవాడి నుంచి మధ్యతరగతి ప్రజలు క్యాన్ వాటర్‌నే తాగుతున్నారు. ఇదే చాలామంది అక్రమార్కులకు లాభసాటి వ్యాపారంగా మారింది. పెద్దగా పెట్టుబడి లేకుండా తక్కువ రోజుల్లోనే లక్షలు గడిస్తుడంటంతో చాలామంది మినరల్ వాటర్ ప్లాంట్లు వ్యాపారాన్ని ఎక్కడో తమిళనాడు నుంచి హెర్బల్ పేరుతో ఒక లెటర్ తీసుకుని ఇదే అనుమతి అంటూ చెబుతూ ప్రజల ఆరోగ్యాలను హరిస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించక పోవడంతో పాటు ఐఎస్ఐ అనుమతి ఏ ఒక్కరికి లేదు. నిబంధనల ప్రకారం ఐఎస్ఐ అనుమతి ప్రతిఏటా లక్షకుపైగా ఖర్చవుతుంది. దీనికి తోడు ప్రతినెలా ప్రభుత్వంకు చెందిన ల్యాబ్‌లు వాటర్ టెస్ట్ చేయించాల్సి ఉంటుంది. వాటర్‌ప్లాంటులో ఆర్‌వో మిషనరీతో పాటు కెమిస్ట్‌తో పాటు మైక్రోబయాలజీ ఉండి నీటిని టెస్ట్ ఓకే అయిన తరువాత నీటిని విక్రయించాల్సి ఉంటుంది. టెస్ట్ పరిశీలనే రెండురోజులు పడుతుంది. కాని కొందరు అక్రమార్కులు రూపాయి ఖర్చుతో పది రూపాయలు సంపాదించాలని అత్యాశతో ఎటువంటి ఐఎస్ఐ అనుమతి లేకుండానే అక్రమవ్యాపారానికి తీరలేపారు. గతంలో ఐఎస్ఐ ఉన్న కంపెనీలో సైతం ప్రసుత్తం రూటుమార్చాయి.

హెర్బల్ ముసుగులో మోసం..

తమిళనాడులో కొందరు ఒక సంస్థను ఏర్పాటు చేసుకుని ఒక ట్రస్టు ద్వారా హెర్బల్ నీటిని విక్రయిస్తున్నారు. అయితే ఇదే అదునుగా తమిళనాడు నుంచి ఆ ట్రస్టు ద్వారా మన రాష్ట్రానికి ఇటువంటి సంబంధం లేని ఒక పత్రాన్ని తెచ్చుకుని హెర్బల్ వాటర్ పేరుతో దర్జాగా నీళ్ల వ్యాపారం చేస్తున్నారు. కాని హెర్బల్ అంటే మెడికేటెడ్ వాటర్ అయిండాలి. అందుకు అవసరమైన హెర్బల్స్‌ను నీటిలో వినియోగించాల్సి ఉంటుంది. కాని చీరాలలో అటువంటివి ఏమి జరగడంలేదు. ప్రసుత్తం చీరాల నియోజకవర్గంలోని కొత్తపేటలో అధికంగా ఈ ప్లాంట్లు నడుస్తున్నాయి. వాటర్ క్యాన్లుతో పాటుగా వివిధ రకాల ఆకర్షణీయమైన పేర్లతో రూ.10 వాటర్ బాటిల్‌ను విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తు కోట్లు గడిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు, ఎలాంటి అనుమతులు లేకుండా కోట్లాది రూపాయల నీళ్ల వ్యాపారాలు చేస్తున్నారు. హెర్బల్ ముసుగులో విచ్చలవిడిగా మంచినీటి ప్లాంట్లు అక్రమంగా నడుస్తున్నాయి.



అపరిశుభ్రంగా ఉన్న 20 లీటర్ల మినరల్ వాటర్ క్యాన్లు

నేరుగా నీళ్లు పట్టి విక్రయిస్తున్నారు..

నియోజకవర్గంలో ఉన్న ఒకటి రెండు మినహా మిగిలిన వాటర్ ప్లాంట్లన్ని ఎటువంటి ప్రాసెసింగ్ చేయకుండా నీటిని తయారు చేస్తున్నారు. మంచినీటి బోర్లు వేసి వాటిని ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా నింపి అదే నీటిని క్యాన్‌లలో పట్టి విక్రయిస్తున్నారు. కంపెనీలు ఇచ్చి ఫ్రిజ్‌లలో నీటిని పోయడం వలన నీరు ఎలా ఉన్నా చల్లగా ఉండటంతో అరలీటరు రూపాయి చొప్పున ప్రజలు కొనుగోలు చేసి మరీ తాగుతున్నారు. చీరాల నుంచే కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, బాపట్ల ప్రాంతాలకు చీరాల కంపెనీల నుంచే వాటర్ క్యాన్లు వెళ్తుంటాయి. చీరాలలో ఉన్న ప్లాంట్ల సామర్థ్యాన్ని నిబంధన ప్రకారం 24 గంటలు పనిచేస్తే 900 క్యానులు కూడా రావడం కష్టం. అయితే ఇటువంటి ప్రాఫిట్ చేయకుండా రోజుకు రెండువేల క్యానులను నింపి విక్రయిస్తున్నారు. ఏడాది చీరాల వాటర్ ప్లాంటు నీటిని అమ్మి ఆరుకోట్ల వరకు సంపాదిస్తున్నారు. క్యాన్ నీటని కేవలం రెండు రూపాయలు ఖర్చు అవుతుంది. వ్యాపారులు దీనిని రూ.15 ఎటువంటి శుభ్రం లేకుండానే ఒక్కో క్యానుకు వసూలు చేస్తున్నారు. వాటర్ క్యాన్లు ఎక్కువ సేపు నిల్వ ఉంటే బ్యాక్టీరియా చేరుతుంది. లేకుంటే ఫంగస్ కూడా పడుతుంది. కాని ఇవేమి పట్టని వాటర్ ప్లాంటులు ఎటువంటి శుద్ధిచేయకుండానే క్యాన్లలో బోరు నీళ్లను నింపుతున్నారు. నిజానికి వాటర్ క్యాన్‌ల మూతసైజు రెండు అంగుళాలు మాత్రమే ఉంటుంది. క్యాన్‌ల లోనికి చెయ్యిపోనిచ్చి శుభ్రపరిచే అవకాశం ఉండదు. దీంతో శుభ్రం లేకుండానే మరల నీటిని పట్టి విక్రయిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

> **బ్యాక్టీరియాతో అనేక వ్యాధులు సోకుతాయి..**
>
> హెర్బల్ పేరుతో నడుస్తున్న కొన్ని వాటర్ ప్లాంట్ల వలన ముప్పు పొంచిఉంది. నీటిలో బ్యాక్టీరియా తప్పకుండా ఉంటుంది. అవి చనిపోవాలంటే క్లోరిన్, ఇతర ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేయాల్సి ఉంటుంది. హెర్బల్ కలిపినంత మాత్రానా బ్యాక్టీరియా చనిపోదు. వీటివల్ల అనేక రోగాలు వస్తాయి. ముఖ్యంగా వైరస్ రోగాలు, గొంతునొప్పి, డయేరియా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది. ప్రజలు సైతం అటువంటి నీటిని టెస్టులు చేసి చర్య తీసుకోవచ్చు. ఇటువంటి ప్లాంట్లపై ఫుడ్ స్టేఫ్టీ యాక్ట్ ప్రకారం వారిని అరెస్టు చేసే అవకాశం ఉంది.
>
> – చెన్నకేశవులు, మాజీ చీఫ్ వాటర్ అనాలసిస్ట్

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నేడు

మేదరమెట్ల: టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి నేడు కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ తెలిపారు. మేదరమెట్ల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం 10.30 అద్దంకి మండలం శింగరకొండకు చేరుకొని అక్కడ ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అక్కడ నుంచి 11.00 మేదరమెట్ల సోమవరప్పాడులో పశువుల ఆసుపత్రి నూతన భవనానికి శంకుస్థాపన, 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించే దేవస్థానానికి శంకుస్థాపన, దక్షిణ బైపాస్ సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఇంటర్‌నేషనల్ ఢీల్లీ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన కార్యమాల్లో వైవీ పాల్గొంటారని చెప్పారు. ఆయనతోపాటు శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి పాల్గొంటారని నేతలు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ యర్రం రత్నారెడ్డి, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, వడ్లమూడి శ్రీనివాసరావు,కే.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తపాలాశాఖ పథకాలతో ఉపయోగాలు

అద్దంకి రూరల్: భారత తపాలశాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు తపాల శాఖ ఎస్ఎస్‌పీవో హరిప్రసాద్ శర్మ అన్నారు. శనివారం స్థానిక మారం వారి సేవాసదన్‌లో జనంలోని మనం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఐపీవో లహోరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న హరిప్రసాద్ శర్మ మాట్లాడుతూ తపాలశాఖ 150 సంవత్సరాల నుంచి ప్రజలకు ఎంతో నమ్మకమైన సేవలు అందిస్తుదన్నారు. ప్రతి మూడు కిలో మీటర్లకు ఒక పోస్టాఫీస్ ఉందన్నారు. భారతదేశంలో అతిపెద్ద నెట్‌వర్క్ కలిగి ఉందన్నారు. తపాల శాఖ అంటే ఉత్తరాలు బట్వాడా చేసేది మాత్రమే భావించవద్దని మారుతున్న కాలనానికి అనుగుణంలో ఎన్నో సేవలు ప్రజలకు అందజేస్తుందన్నారు. పోస్టాఫీస్‌ల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి 'బేటిపడావో–బేటి బచావో' ద్వారా బాలికల ఉన్నతి కోసం సుకన్యసమృద్ధి పథకం, పాల జీవిత రక్షణ బీమా, సేవింగ్ ఖాతాల ద్వారా ఐపీపీబీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం స్థానిక ఐపీవో లహోరి, ఎస్ఎస్‌పీవో ను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో సుధాకర్, విశ్రాంత తపాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎస్‌పీవో హరిప్రసాద్ శర్మ

లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులే అంతిమం



పర్చూరు లోక్ అదాలత్‌లో తీర్పు ఇస్తున్న జడ్జిలు

చీరాల రూరల్: లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులే అంతిమ తీర్పులని.. ఆయా తీర్పులపై ఇతర కోర్టులలో అప్పీలు చేసుకునే అవకాశం లేదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సముదాయంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ముందుగా కక్షిదారులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఎం. సుధ, షేక్ రెహాన, షేక్ నిషాద్ నాజ్‌లు మాట్లాడారు. లోక్ అదాలత్‌లకు ముందుగా ఇరు పక్షాలకు చెందిన కక్షిదారులకు కేసుల విషయమై పరస్పరం అవగాహన కల్పించి కేసులను రాజీ మార్గంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈఅదాలత్‌లో 1163 కేసులను పరిష్కరించారు. మెంబర్లుగా న్యాయవాదులు ఎ. కొండమ్మ, స్నేహ, టి. శారద, ఎ. సతీష్ రెడ్డి పారా లీగల్ వలంటీర్లు డి ఇమ్మానియేలు, మతీన్‌లు వ్యవహరించారు.

పర్చూరులో 391 కేసులు రాజీ..

పర్చూరు (చినగంజాం): పర్చూరు కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 391 కేసులు విచారణ చేసి రాజీ కుదిర్చినట్లు సీనియర్ సివిల్ జడ్జి శుభవాణి తెలిపారు. జరిమానా రూపంలో రూ 92.30 లక్షలు విధించినట్లు ఆమె తెలిపారు. రెండు బెంచ్‌లకు ప్రిసైడింగ్ జడ్జిలుగా సీనియర్ సివిల్ జడ్జి ఎం శుభవాణి, జూనియర్ సివిల్ జడ్జి పీ శాంతిలు వ్యవహరించారు. రెండు బెంచ్‌లకు మెంబర్‌లుగా సీహెచ్ శ్రీరమణి, కే ధనలక్ష్మి, ఆర్ రమేష్ బాబు, టీ రాజేశ్‌లు వ్యవహరించారు.

సంక్షేమం, అభివృద్ధికే అధిక ప్రాధాన్యం

- గడప గడపలో నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్.



మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఇన్‌చార్జి వెంకటేష్.

చీరాల: రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతీ సమస్యకు సత్వర పరిష్కారం చేస్తున్నామని చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శనివారం రాత్రి మున్సిపాలిటీలోని 16వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందించారు. అవ్వా బాగున్నావా ఫించన్ అందుతుందా అంటూ వృద్ధురాలితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్బంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇళ్లు లేని పేదలకు పక్కా ఇళ్లు కట్టిస్తున్నారని, వైఎస్సార్ భరోసా ద్వారా ఫించన్‌ను ఒక్కొక్కరికి రూ.2750 అందిస్తున్నారన్నారు. పేద ప్రజలకు ఎలాంటి సిఫార్సులు లేకుండా పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్లు బొనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డీఈ ఏసయ్య, 16 వార్డు కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు, కార్పొరేషన్ జి.శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎం.లలిత, మామిడాల రాములు, బత్తుల అనీల్, కంపా అరుణ్, గొట్టిపాటి ఎబినేజర్, ఎం. సాంబశివరావు, సీఐ సోమశేఖర్, పార్టీ నాయకులు జి.మాధవరావు, గోలి గంగాధర్, బి.సాంబశివరావు, జి.విశ్వం, తదితరులు పాల్గొన్నారు.



అవ్వతో మాట్లాడుతున్న వెంకటేష్

అఖండ భజన కరపత్రాల ఆవిష్కరణ

యర్రగొండపాలెం: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీన నీగానమే నాప్రాణం అంఖండ భజన కార్యక్రమం కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. అఖండ భజన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, ప్రముఖ గాయకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. భజన బృందాలు భజన పాటలు మాత్రమే పాడాలని, ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, 94406 46641, 94404 86901 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. 15వ తేదీ ఉదయం 5 గంటలకు ధ్వజారోహణం, స్వదేశీ గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, అఖండ నామ సంకీర్తన లాంటి కార్యక్రమాలు రాత్రి 9 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆ కమిటీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, కందూరి రామయ్య, యక్కలి భాగ్యారావు, కందూరి కాశీనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాస్, వెంకటస్వామి పాల్గొన్నారు.

చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సాయం

చీరాల రూరల్: మంచి పనులు చేయడానికి ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటామని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణలు పేర్కొన్నారు. అరుదైన వ్యాధులతో ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న 16 నెలల బాలుడికి చీరాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వైద్య ఖర్చులు నిమిత్తం రూ. 30,200 అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. శనివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న చిన్నారి తండ్రికి వాకర్లు నగదు అందజేశారు. ఈ సందర్బంగా వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడారు. చీరాల వైకుంఠపురానికి చెందిన చిన్నారి కిడ్నీ, లివర్, మెదడు సంబంధిత వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నాడ. చిన్నారి తండ్రి వాకర్స్ ప్రతినిధులను సంప్రదించి సహాయం అందించమని లిఖిత పూర్వకంగా అభ్యర్థించడంతో చలించిపోయిన సభ్యులు చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం సభ్యుల అందరి సహకారంతో సాయమందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కక్షిదారులకు అన్నదానం



కక్షిదారులకు అన్నదానం చేస్తున్న దాతలు, రోటరీ ప్రతినిధులు

పర్చూరు(చినగంజాం): మెగా లోక్ అదాలత్ కార్యక్రమం పురస్కరించుకొని కోర్టుకు వచ్చిన కక్షిదారులకు అన్నదానం నిర్వహించారు. పర్చూరు కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన అదాలత్‌లో 150 మందికి పర్చూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా నరేంద్రకుమార్ ఆర్థిక సహకారంతో పర్చూరు రోటరీ క్లబ్ వారు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్బంగా సీనియర్ అడ్వకేట్ రావి సత్యనారాయణ, ఆర్థిక సహకారంతో వికలాంగులైన వ్యక్తుల కోసం వీల్ చైర్ బార్ అసోసియేషన్‌కు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ అవకాశం రోటరీ క్లబ్‌కు కల్పించినందుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు పాబోలు ఉదయ భాస్కర్, కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, ఆకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చీరాల టౌన్: వేటపాలెం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దేవాంగపురి శివాలయంలో నిరుపేదలకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు బట్ట మోహనరావు, కార్యదర్శి సురేష్‌బాబులు అన్నదానం కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు రాజేష్, మణికంఠ, పద్మాకరరావు తదితరులు ఉన్నారు.

తప్పు చేస్తే ఎంతవారైనా శిక్ష తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న మస్తాన్ వలి

పర్చూరు (చినగంజాం): తప్పు చేసిన వారు ఎంత పెద్దవారైనా శిక్ష పడక తప్పదని బాపట్ల జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబునాయుడు హస్తం ఉందని సీఐడీ నిరూపించదన్నారు. స్కాంలో గంటా శ్రీనివాసరావు కుమారుడుతో పాటు అచ్చెన్నాయుడి హస్తం కూడా ఉందని ఆరోపించారు. అపార అనుభవజ్ఞులైన చంద్రబాబు నాయుడు అనేక ఆర్థిక నేరాలలో చిక్కుకున్నాడని స్కిల్ డెవలప్‌మెంట్ ఒక చిన్న ఉదాహరణ మాత్రమేనని నాయకులు భవనం రాజగోపాలరెడ్డి అన్నారు. ఈ స్కాంలో చంద్రబాబు నాయుడు తప్పించుకునే అవకాశం లేదని అడపా సుధాకర రెడ్డి అన్నారు. సీఎం జగన్ దిష్టి బొమ్మను దగ్ధం చేయడంపై నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోనాయకులు మైలా చిన నాగేశ్వరరావు, కోట శ్రీనివాసరావు, తులసి నాగమణి, పఠాన్ కాలేషవలి, గాదె సురేష్, పీ ప్రకాష్, ఒగ్గిశెట్టి ప్రసాద్,దండా చౌదరి, ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, చిన్ని, జంగా అనిల్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.